
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక





ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 355 | మంగళవారం 25 నవంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

# మోగిన నగారా

**తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల**

- మూడు విడతల్లో తెలంగాణ పంచాయతీ ఎన్నికలు
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- నేటి నుంచి అమల్లోకి ఎన్నికల నియమావళి
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అబ్జర్వల్‌లు, ఎలక్షన్ అబ్జర్వల్‌లను నియమించాం
- 31 జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు
- కోటి 66 లక్షలకుపైగా ఓటర్లు






**హైదరాబాద్**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సాయంత్రం మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం - మిగతా3లో

# రాష్ట్రంలో ఇక 29 జిల్లాలు

- మంత్రుల కమిటీ సిఫార్సుకు సీఎం చంద్రబాబు ఆమోదం...
- ఏపీలో మరో మూడు కొత్త జిల్లాల ఏర్పాటుకు ఆమోదం
- పోలవరం, మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా నూతన జిల్లాలు
- రాష్ట్రంలో 29కి పెరగనున్న మొత్తం జిల్లాల సంఖ్య
- కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటుకు నిర్ణయం
- మంత్రుల కమిటీ సిఫార్సులకు ఆమోదం తెలిపిన సీఎం చంద్రబాబు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా సౌలభ్యం కోసం మరిన్ని కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే ప్రక్రియకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం తన ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్వ్ భజనపై ఏర్పాటైన మంత్రుల కమిటీ సమర్పించిన సిఫార్సులపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ఆయన, ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరగనుంది. మార్కాపురం, మదనపల్లెతో పాటు గిరిజన ప్రాంతమైన రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిపాదనలను త్వరలో కేబినెట్ సమావేశంలో చర్చించి, ఆమోదం పొందాక అధికారికంగా - మిగతా3లో

# నేనున్నాను..

## పులివెందుల ప్రజాదర్బార్‌లో వైఎస్ జగన్

- వరుస తుపాన్లు, వర్షాలతో తాము అల్లాడిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం నుంచి కనీస సాయం కూడా అందడం లేదు
- మేం సీట్లు కోల్పోయాం: వైద్య విద్యార్థులు
- కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకం
- పులివెందుల చుట్టుపక్కల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్..



**వైఎస్సార్**

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహ న్‌రెడ్డి రాకతో పులివెందుల జనసందోహంగా మారింది. భాక˘రాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్య కర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. వారి బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ.. - మిగతా3లో

# 'ఆప్కో'లో సంక్రాంతి వరకు ఆఫర్



**అమరావతి**

ఆప్కో అమ్మకాల్లో సంక్రాంతి వరకు ఆఫర్ కొనసాగిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆప్కో షో రూమ్ ల ద్వారా 40 శాతం డిస్కౌంట్ కు చేనేత వస్త్రాలు విక్రయించనున్నట్లు మారుతున్న అభిరుచుల దృష్ట్యా ప్రజల్లోనూ చేనేత వస్త్రాల వినియోగంపై మక్కువ పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకుని ఆప్కో షో రూమ్ ల్లో చేనేత వస్త్రాలను 40 శాతం డిస్కౌంట్ పై విక్రయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో డిస్కౌంట్ అమ్మకాలు వచ్చే సంక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు - మిగతా3లో

# ఆంధ్ర జట్టును గెలిపించిన రాజేష్ వీరారెడ్డి










**అండర్-19 మెన్స్ మల్టీ డేస్ పోటీలలో ఒరిస్సా పై ఆంధ్ర జట్టు విజయం**



**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం నవంబర్ 25**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్ 19 కూచ్ బిహారి అంతరాష్ట్ర క్రికెట్ పోటీల్లో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది ఆంధ్ర జట్టు బ్యాట్స్మెన్ అనంతపురం జిల్లాకు చెందిన వీరారెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆంధ్ర జట్టు భారీ స్కోరు సాధించింది వీరారెడ్డి అద్భుతమైన బ్యాటింగ్ చేసి గ్రౌండ్ నలుమూలల బౌండరీల వర్షం కురిపించారు వీరారెడ్డి మొత్తం 77 పరుగుల్లో ఏడు ఫోర్లు ఐదు సిక్సర్లు సాధించారు అనంతరం బౌలింగ్ చేసిన ఆంధ్ర బౌలర్ ఆంధ్ర జట్టు కెప్టెన్ రాజేష్ అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో ఆంధ్ర జట్టును గెలిపించారు ఆంధ్ర జట్టు కెప్టెన్ రాజేష్ 6 వికెట్లు - మిగతా2లో

# రాష్ట్రంలో ఇక 29 జిల్లాలు

-మొదటిపేజీ తరువాయి
నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**కొత్త జిల్లాల స్వరూపం ఇలా...**

పోలవరం జిల్లా: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో ఈ జిల్లా ఏర్పాటవుతోంది. రంపచోడవరం డివిజన్‌లోని రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఇందులో ఉంటాయి. చింతూరు డివిజన్‌లోని యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. సుమారు 3.49 లక్షల జనాభాతో రంపచోడవరం కేంద్రంగా ఈ గిరిజన జిల్లా రూపుదిద్దుకోనుంది. మార్కాపురం జిల్లా: ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు కానుంది. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లలోని 22 మండలాలను ఇందులో చేర్చారు. మార్కాపురం డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు ఉంటాయి. కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు ఈ జిల్లాలో భాగం కానున్నాయి. మొత్తం 11.42 లక్షల జనాభాతో ఈ జిల్లాను ఏర్పాటు చేస్తున్నారు. మదనపల్లె జిల్లా: అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు కానుంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న పీలేరు, పాత మదనపల్లె రెవెన్యూ డివిజన్లలోని 19 మండలాలను ఈ జిల్లాలో చేర్చారు. మదనపల్లె డివిజన్‌లో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు ఉంటాయి. పీలేరు డివిజన్‌లో సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారి పల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉంటాయి. ఈ జిల్లా జనాభా సుమారు 11.05 లక్షలుగా ఉండనుంది.

**కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు**

మూడు కొత్త జిల్లాలతో పాటు, రాష్ట్రంలో పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సీఎం ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పడనున్న మదనపల్లె జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర కేంద్రాలుగా కొత్త రెవెన్యూ డివిజన్లు రానున్నాయి. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి, పెద్దహరివనంను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం పేరును "వాసవీ పెనుగొండ మండలం"గా మార్చనున్నారు.

**ఇతర ముఖ్యమైన మార్పులు**

మంత్రుల కమిటీ సిఫార్సుల మేరకు అనేక మండలాలను, నియోజకవర్గాలను వేర్వేరు డివిజన్లు, జిల్లాల్లోకి మార్చారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. అదేవిధంగా కందుకూరు నియోజ కవర్గాన్ని కూడా ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూర్, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో చేర్చనున్నారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ నుంచి పెద్దాపురం డివిజన్‌లోకి మార్చనున్నారు. ఈ పునర్వి భజన ప్రక్రియలో భాగంగా 17 జిల్లాల భౌగోళిక స్వరూపంలో మార్పులు చోటుచేసుకోగా, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పులూ లేవు.

# కట్టుతప్పుతున్న ఎమ్మెల్యేలు

**విజయవాడ :** 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన, బీజేపీ కూటమి 164 సీట్లతో అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేవలం 11 సీట్లతో ప్రతిపక్షంగా మిగిలింది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ అసెంబ్లీకి రావడం మానేశారు. ఈ "బలహీన ప్రతిపక్షం" కూటమి ప్రభుత్వానికి "సమస్యగా" మారిన సూచనలు కనిపిస్తున్నాయి. తమకు "ఎదురు లేదని" ఎమ్మెల్యేలు కట్టుతప్పుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడం రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా మార్చేసింది. అవినీతి ఆరోపణలు, పాలనలో ఘోరాలు, రైతులు, మహిళలు, యువతలో అసంతృప్తి కారణంగా వైసీపీ ఘోరంగా ఉడిపోయింది. వైసీపీకి ప్రతిపక్ష హోదాకు అవకాశం లేకపోవడం వల్ల.. అసెంబ్లీ రూల్స్ ప్రకారం 10% సీట్లు అవసరం అయినా రాకపోవడం వల్ల "సైలెంట్ ఓపోజిషన్" స్థితిని సృష్టించింది. ప్రతిపక్ష బలహీనత ప్రభుత్వానికి "ఫ్రీ పాస్" ఇస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ రాకపోవడం, హౌస్ కమిటీల్లో ఉండకపోవ ఫలితంగా, ప్రభుత్వ నిర్ణయాలపై రాజ్యాంగ వేదికపై ప్రశ్నించడం తగ్గిపోయింది."సరైన ప్రతిపక్షం లేకపోవడం" కూటమి ప్రభుత్వానికి రెండు వైపులా సమస్యలు సృష్టిస్తోంది. ఎదురు లేకపోవడం వల్ల ప్రభుత్వం సులభంగా రీఫార్మ్స్ అమలు చేస్తోంది. జనసేన, బీజేపీలు కూటమి భాగస్వాములు కావడం వల్ల అంతర్గత విమర్శలు తక్కువ. కానీ ప్రతిపక్షం లేకపోవడం "అకౌంటబిలిటీ"ను తగ్గిస్తుంది. వైసీపీ అసెంబ్లీకి రాకపోవడం పార్లమెంటరీ డెమాక్రసీకి దెబ్బ అనుకోవచ్చు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం ప్రభుత్వాన్ని "అబ్యూజ్ ఆఫ్ పవర్"కు ప్రేరేపిస్తుంది. ఇప్పుడు అదే జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష బలహీనత వల్ల కొంతమంది ఎమ్మెల్యేలు "కట్టుతప్పుతున్నారన్న" ఆరోపణలుపెరిగాయి. ఎదురు లేకపోవడం వల్ల "చెక్స్ అండ్ బాలెన్సెస్" లేకపోవడం అనైతికతకు దారి తీస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల ఎమ్మెల్యేలు "సెల్ఫ్-సర్వింగ్" మోడ్‌లోకి వెళ్లారు. అందుకే ఎమ్మెల్యేలపై ఆరోపణలు



వస్తున్నాయి. టీడీపీతో పాటు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కూడా కొంత మంది ప్రత్యేకంగా దందాలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేల తీరుపై హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే వారిలో ఎంత మంది పట్టించుకుంటున్నారో లేదో స్పష్టత లేదు. ఎమ్మెల్యేల వల్ల ప్రభుత్వానికి ఎంతో ఇబ్బంది ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రతిపక్షం లేకపోవడం వల్ల "ఇన్‌ఫైటింగ్" పెరిగే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ-జనసేన మధ్య ఇలాంటివి తరచూ కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో ఉన్నప్పుడు వివిధ అంశాలపై వేర్వేరు అభిప్రాయాలు సహజమే కానీ.. అవి ప్రతిపక్షం లేకపోవడం వల్ల రావడం సమస్యలు సృష్టిస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల అకౌంటబిలిటీని తగ్గించి, అనైతిక ప్రవర్తనలకు దారి తీస్తోంది. ఎమ్మెల్యేలు "ఎదురు లేదని" లాభపడుతున్నారనే ఆరోపణలు నిజమవుతున్నాయి. ఇది లాంగ్-టర్మ్‌లో ప్రభుత్వానికి బూమరాంగ్ అవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం జాగ్రత్త పడాల్సిన అవసరం కనిపిస్తోంది.

## దూరం.. దూరం అంటూనే ..

# దగ్గరవుతున్న విజయసాయి

**విజయవాడ :** రాజకీయాలకు గుడ్‌బై..ఇక నుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పి ఏడాది కాకముందే ఎప్పుడూ ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తూ..ఆసక్తికర ట్వీట్స్ చేస్తూ పొలిటికల్ హాట్ టాపిక్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడేమో ఏ పార్టీలో చేరే ఆలోచన లేదంటారు. మరోసారి అవసరమైతే కొత్త పార్టీ పెడతా అంటారు. తన అవసరం ఉందనుకుంటే రాజకీయాల్లోకి వస్తానంటారు.అసలు ఈ పొంతన లేని స్టేట్‌మెంట్స్ ఎందుకన్న చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఎప్పటిలాగే..జగన్ కోటరీ అంటూ డైలాగులు పేల్చారు. పవన్‌ను పొగిడేందుకు ప్రయత్నించారు. తనకు ఆయనతో 20 ఏళ్ల స్నేహం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయనను తాను ఎప్పుడూ ఒక్క మాట కూడా అనలేదని.. భవిష్యత్‌లో కూడా అనననని చెప్పారు. కానీ గతంలో పవన్‌ను పావలా అని.. విమర్శించిన విషయాన్ని ఆయన మార్చిపోయారంటూ సోషల్ మీడియాలో మీమ్స్ వస్తున్నాయ్.ఎప్పటికప్పుడు సమ్‌థింగ్ డిఫరెంట్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తూ వస్తున్నారు విజయసాయిరెడ్డి. మొన్నటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లుగా..పబ్లిక్ వాయిస్‌గా ట్వీట్స్ చేస్తూ చర్చకు దారితీశారు. ఇప్పుడేమో తన అవసరమైతే మళ్లీ పాలిటిక్స్‌లోకి వస్తానంటున్నారు. ఆయన అవసరం పబ్లిక్‌కు ఉందా? లేక ఆయనకే రాజకీయాలు తప్పనిసరిగా మారాయా అన్నది ఇక్కడ పాయింట్. విజయసాయిరెడ్డి అవసరం వైసీపీకి ఉండొచ్చు. ఎందుకంటే గతంలో ఆ పార్టీలో నెంబర్.2గా పనిచేశారు. తెరవెనుక రాజకీయాలు చక్కబెట్టడంలో జగన్‌కు సాయిరెడ్డి బ్యాక్ బోన్ లాంటి వాడని చెప్తుంటారు. అలాంటి విజయసాయిరెడ్డి వైసీపీని వీడినప్పటి నుంచి జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్నారు.కోటరీ వల్లే తాను జగన్‌కు దూరమయ్యాను..జగన్‌ను మిస్ అవుతున్నాను అన్నట్లుగా మాట్లాడుతున్నారు విజయసాయిరెడ్డి. తన విషయంలో జగన్ కోటరీ ఆయనను పూర్తిగా డైవర్ట్ చేస్తోందని..అలాంటి వారి మాటలు వినరాదని, అన్నీ ఆలోచించాలని జగన్‌కు సూచించారు. అంటే జగన్ మంచిని కోరుకుంటున్నాను అన్నట్లుగా చెప్పుకొచ్చారు విజయసాయిరెడ్డి.విజయసాయిరెడ్డి మాజీ ఎంపీ మాత్రమే కాదు..మాజీ వైసీపీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. ఆయన ఏం మాట్లాడినా పొలిటికల్ యాంగిల్ వెతకడం, దాన్ని హైలెట్ చేయడం కామన్. ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా విజయసాయిరెడ్డి చేసిన కామెంట్స్ పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. సాయిరెడ్డి మనసు వైసీపీ వైపు లాగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదో ఒక ఫైన్ మార్నింగ్ విజయసాయిరెడ్డి వైసీపీలో చేరిక ప్రకటన రావొచ్చన్న ఊహాగానాలు ఉండే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తోంది. వైసీపీ అధినేత జగన్ పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ వస్తున్నారు. పార్టీకి దూరమైన నేతలను దగ్గర చేసే ప్రయత్నాల్లో పడ్డారు.మొన్నా మధ్య పార్టీని విడిచి వెళ్లిపోయిన నేతలు తిరిగి పార్టీలోకి రావొచ్చు..నో అబ్జక్షన్స్ అంటూ వైసీపీ ఇంటర్నల్ మీటింగ్‌లో ఓపెన్ ఆఫర్ ఇచ్చారు జగన్. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీ గూటికి చేరతారని పెద్దఎత్తున ప్రచారం కూడా నడిచింది. అయితే జగన్ నుంచే పిలుపు రావాలని విజయసాయిరెడ్డి ఎదురుచూస్తున్నట్లు ఇన్ సైడ్ టాక్. ఇది ఎంతవరకు నిజమో తెలియదు కానీ.. వ్యవసాయం చేసుకుంటానని చెప్పి..విజయసాయిరెడ్డి తరచూ రాజకీయాలు..పొలిటికల్ రీఎంట్రీపై మాట్లాడుతుండటం మాత్రం ఆయనలో ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్‌ను స్పష్టం చేస్తోంది. రాబోయే రోజుల్లో విజయసాయిరెడ్డి రాజకీయ అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.

సైరా నరసింహారెడ్డి సంగతేంటీ

ఇక.. పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు, రాజశేఖర్ రెడ్డి పేరుతో జిల్లాలు ఉన్నాయని.. సైరా నరసింహారెడ్డి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని ఆయన సూచించారు. అలా చేస్తే ఒక స్వాతంత్ర్య సమరయోధుడిని గౌరవించినట్టు అవుతుందన్నారు. శ్రీకాకుళంలో రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి మొత్తం నేనే భరిస్తాను అని చెప్పారు. చాలామంది నాపై చాలా సెటైర్లు వేస్తున్నారన్న విజయసాయిరెడ్డి.. ఎవరెన్ని అనుకున్నా నేను ప్రస్తుతం రైతును మాత్రమే అని తేల్చి చెప్పారు.చాలా ఒత్తిళ్లు వచ్చాయి. ప్రస్తుతానికి రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదు. ఇతర పార్టీల్లోనూ చేరే ఉద్దేశమూ లేదు. విపరీతమైన ఒత్తిడి వచ్చినా నేను ఎవరికీ లొంగలేదు. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ని డైవర్ట్ చేస్తోంది. అందుకే నేను రాజకీయాలకు దూరంగా ఉంటున్నా. నిబద్ధత లేని వారి మాటలు వినొద్దని జగన్ కు నా సూచన. నాకు ఏ పార్టీ నుంచి కూడా పిలుపు రాలేదు. ప్రస్తుతానికి నేను రైతును మాత్రమే. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో 20 ఏళ్ల స్నేహం ఉంది. ఆయనను ఒక్క మాట కూడా అనలేదు" అని హాట్ కామెంట్స్ చేశారు విజయసాయిరెడ్డి.

## ఆంధ్ర జట్టును గెలిపించిన రాజేష్ వీరారెడ్డి

-మొదటిపేజీ తరువాయి
తీయడంతో పాటు లోహిత్ మూడు వికెట్లు తీయడంతో ఒరిస్సా జట్టు కుప్పకూలింది నాలుగు రోజులు జరగాల్సిన మ్యాచ్ మూడు రోజుల్లోనే ఆంధ్ర జట్టు ఒరిస్సా పై ఘనవిజయం సాధించింది

బోర్డు ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బి సి సి ఐ)వారి ఆధ్వర్యంలో రాష్ట్రాల స్థాయిలో అండర్-19 మెన్స్ మల్టీ డేస్ మ్యాచ్ లో భాగంగా అనంతపురం ఆర్.టి.డి గ్రౌండ్స్ లో ఆంధ్రప్రదేశ్,ఒరిస్సా మధ్య జరిగిన మ్యాచ్ లో ఆంధ్ర జట్టు విజయం సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 282 పరుగులు చేసింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో సి.లోహిత్ లక్ష్మీనారాయణ సెంచరీ సాధించి 101 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన ఒరిస్సా జట్టు 120 పరుగులకు ఆల్ అవుట్ అయింది. . రెండో ఇన్నింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 215 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్ లో కె వీరారెడ్డి 77 పరుగులు చేశారు.తర్వాత ఇన్నింగ్ ప్రారంభించిన ఒరిస్సా జట్టు 120 పరుగులకు ఆల్ అవుట్ అయింది. రెండవ ఇన్సింగులు ఎన్.రాజేష్ 6 వికెట్లు తీసి ఆకట్టుకున్నారు. ఈ మ్యాచ్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఒరిస్సా జట్టుపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మూడు రోజుల్లో మ్యాచ్ ముగిసింది. విజయం సాధించిన ఆంధ్ర జట్టును ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ కార్యదర్శి సానా సతీష్ బాబు అభినందించారు

## మన సంస్కృతి, నాగరికత..
## దేశానికి పునాది వంటివి..

-మొదటిపేజీ తరువాయి
వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేథో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం (జెండా ఎగురవేయడం) కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

## ' ఆప్కో'లో సంక్రాంతి వరకు ఆఫర్

-మొదటిపేజీ తరువాయి
తెలిపారు. డిస్కౌంట్ లో అమ్మకాలతో అటు ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుతోందన్నారు. అదే సమయంలో చేనేత వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తోందని తెలిపారు. 40 శాతం డిస్కౌంట్ కు ఆప్కో షో రూమ్ ల ద్వారా చేనేత వస్త్రాలను విక్రయించడం వల్ల అమ్మకాలు సైతం పెరిగినట్లు మంత్రి సవిత వెల్లడించారు. డిస్కౌంట్ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షో రూమ్ ల ద్వారా రోజుకు సరాసరి రూ.3 లక్షల చొప్పున విక్రయాలు జరిగేవన్నారు. 40 శాతం డిస్కౌంట్ తో అమ్మకాలు ప్రారంభించిన తరవాత రోజువారీ అమ్మకాలు రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి సవిత తెలిపారు. డిస్కౌంట్ విక్రయాలతో పాటు చేనేత వస్త్రాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రస్తుత ట్రెండ్ ను దృష్టిలో పెట్టుకుని చిన్నారులతో పాటు ఆయా వయస్సుల వారికి అవసరమైన రెడీ మేడ్ చేనేత వస్త్రాలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయిస్తున్నామన్నారు. దీంతో చేనేత వస్త్రాల కొనుగోలు పెరిగినట్లు మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. త్వరలో విశాఖ, కర్నూలు, కడప వంటి నగరాలతో పాటు ఇతర జిల్లా కేంద్రాల్లోనూ చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## నేనున్నాను..'

-మొదటిపేజీ తరువాయి
'నేనున్నాను' అంటూ భరోసాతో పాటు ధైర్యాన్ని కల్పించారు.

పులివెందుల చుట్టుపక్కల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్.. వారి యోగక్షేమాలు తెలుసుకుని, వారి సమస్యలు ఓపిగ్గా విన్నారు. వారికి భరోసా కల్పించారు. స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి ఏం చెయ్యాలో పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు.

ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి మేలు ఒకటి కూడా జరగలేదని వచ్చిన వారంతా తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అన్ని వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చిన వైఎస్ జగన్, వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

గోడు వెల్లబోసుకున్న రైతులు

వరుస తుపాన్లు, వర్షాలతో తాము అల్లాడిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం నుంచి కనీస సాయం కూడా అందడం లేదని ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తామంతా భరోసాగా బ్రతికామని, కానీ ఇప్పుడు వ్యవసాయం అంటేనే అన్నదాతలు భయపడే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వంపై రైతుల తరుపున పోరాడతామని.. వారికి అండగా ఉంటామని జగన్ భరోసానిచ్చారు.

మేం సీట్లు కోల్పోయాం: వైద్య విద్యార్థులు

చంద్రబాబు సర్కార్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పలువురు వైద్యవిద్యార్థులు వైఎస్?జగన్‌ను కలిసి వాపోయారు. పులివెందుల, పాడేరుతో మరో వంద సీట్లు వచ్చేవని.. అయితే కూటమి సర్కార్ నిర్ణయంతో సీట్లు కోల్పోయామని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఒక్క మార్కుతో సీటు కోల్పోయానని చరణ్ అనే విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని జగన్ భరోసా ఇచ్చారు.

## నియోజకవర్గం మార్పు తప్పదా

**రాజమండ్రి :** జనసేనకు చెందిన మంత్రి కందుల దుర్గేష్ ఈసారి నియోజకవర్గాన్ని మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ కందుల దుర్గేష్ సొంత ప్రదేశం రాజమండ్రి కావడంతో వచ్చే ఎన్నికల్లో కందుల దుర్గేష్ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ నుంచి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. గత ఎన్నికల సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నిక అని కూడా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించార. దీంతో వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించి, నిడదవోలు నియోజకవర్గాన్ని టీడీపీకి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కందుల దుర్గేష్ పర్యాటక, సినిమా టోగ్రఫీ మంత్రిగా ఉన్న ప్పటికీ ఆయన ఎక్కువ సమయం రాజమండ్రి లోనే గడుపుతున్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం జనసేన నేతలు, క్యాడర్ తోనూ ఆయన టచ్ లో ఉండటం కూడా ఈ సందేహాలకు మరింత ఊతమిచ్చినట్లు కనిపిస్తుంది. సీనియర్లను క్రమంగా పక్కన పెడుతున్న టీడీపీ అధినాయకత్వం ఈసారి గోరంట్ల బుచ్చయ్య చౌదరికి కూడా టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. ఆయన ఇప్పటికే ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయనకు నామినేటెడ్ పదవి ఇచ్చిపెద్దల సభకు పంపుతామని చెప్పి రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారని, అక్కడి నుంచి కందుల దుర్గేష్ పోటీ చేయడం ఖాయమని చెబుతున్నారు. టీడీపీకి స్ట్రాంగ్ హోల్డ్ గా ఉన్న... నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నిడదవోలు నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014 ఎన్నికల్లో అక్కడి నుంచి టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు గెలిచారు. అంటే ఇక్కడ టీడీపీ స్ట్రాంగ్ గా ఉంది. నిడదవోలు టీడీపీ క్యాడర్ నుంచి కూడా వత్తిడి తీవ్రంగా

## నవంబర్ 25 నుండి డిసెంబర్ 23 వరకు లింగవివక్ష నిర్మూలనకు నెలపాటు జాతీయ ప్రచారం ప్రారంభం

- జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్



**అంకుశం న్యూస్ పుట్టపర్తి, నవంబర్ 25:** లింగవివక్ష ఆధారిత వివక్షను నిర్మూలించడం, లింగ సమానత్వంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నెలపాటు జాతీయ ప్రచారం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులతో కలిసి 'జెండర్ అవేర్‌నెస్ పోస్టర్ల'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రచారాన్ని పంచాయతీ రాజ్ శాఖ, మహిళా & శిశు సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ, DRDA సంయుక్తంగా సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. సమాజంలో మహిళల స్థానం బలోపేతం చేయడం, వివక్షను తగ్గించడం, సమాన హక్కులు, సమాన అవకాశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమపు ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. నెలపాటు ఈ జాతీయ ప్రచారాన్ని నాలుగు థీమ్ వారాలుగా విభజించినట్లు వివరించారు. : మహిళల ఆర్థిక శక్తివంతతమహిళల ఆర్థిక పాత్రపై అవగాహన.స్వయం ఉపాధి, SHG లు, నైపుణ్యాభివృద్ధి, చిన్న వ్యాపారాల్లో వృద్ధి. మహిళల ఆర్థిక స్వావలంబనకు సంబంధించిన ప్రభుత్వ పథకాల ప్రచారం. పురుషులు– మహిళలకు సమాన వనరులువిద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, ఆస్తి, ప్రభుత్వ సేవల్లో సమాన అవకాశాలు.వనరుల పంపిణీ, అవకాశాల ప్రాప్తిలో వివక్ష నిర్మూలన. సమాన హక్కులపై చట్టాల అవగాహన. 3వ వారం: మహిళలు & బాలికల భద్రత ు స్వేచ్ఛాయుత ప్రయాణంభయరహిత వాతావరణం సృష్టించడం.పబ్లిక్ ప్రదేశాలు, రవాణా వ్యవస్థల్లో భద్రతా చర్యల బలోపేతం.విద్యాసంస్థలు/ఉద్యోగాలకు బాలికలు స్వేచ్ఛగా వెళ్లేలా అనుకూల వాతావరణం. 4వ వారం: చెల్లింపు లేని గృహపనులపై అవగాహన

మహిళలపై అధికమవుతున్న unpaid care work గుర్తింపు. ఈ పనులకు సామాజిక విలువ పెంపు.గృహపనుల్లో పురుషుల భాగస్వామ్యంపై ప్రచారం, చర్చలు, వర్క్‌షాప్‌లు. నిర్వహించాలని జేసి సూచించారు. ఈ నెలపాటు జాతీయ ప్రచారం ద్వారా లింగ సమానత్వం, మహిళా భద్రత, స్వావలంబన, న్యాయం, గౌరవం వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జేసి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నర్సయ్య, డీఈవో క్రిష్టప్ప, ఐసిడిఎస్ సీడీపీఓ గాయత్రి, డిఆర్డిఏ ఏపీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులంతా ఒకేసారి ఒకే రకం పంటలు వేయవద్దు

దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదే

రైతన్నా–మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

మామిళ్లపల్లిలో రైతులతో మమేకం, అధికారులతో అవగాహన కార్యక్రమాలు





**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 25:** అనంతపురం జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గం లో గలరైతులంతా ఒకేసారి ఒకే రకం పంటలు సాగు చేసి నష్టపోవద్దని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామంలో ఆమె రైతన్నా–మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, కేంద్రీయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి ఆమె ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిన పత్రాన్ని వారికి అందజేశారు. అన్నదాత సుఖీభవ మీకు అందిందా.... రెండు విడతలుగా ఎంత మేర సాయం అందింది.. ఇందు కోసం ఎవరికైనా డబ్బు ఇచ్చారా వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. రైతులంతా ఈ పథకం విషయంలో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు 50% సబ్సిడీతో పశువుల దాణా అందజేశారు. ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత వివరించారు. ముఖ్యంగా గ్రామంలో కానీ.. లేదా ఒక మండలంలో కానీ.. జిల్లాలో కానీ రైతులంతా ఒకే రకం పంటలు ఒకే సీజన్లో సాగు చేయడం వల్ల గిట్టుబాటు ధరలు తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పుడైనా పంటలు తక్కువగా ఉన్నప్పుడు ధరలు బాగుంటాయన్నారు. రైతులంతా ఒకేసారి పంటలు సాగు చేయడం వల్ల దిగుబడులు ఎక్కువై ఎగుమతులు ఉండవన్నారు. ప్రస్తుతం టమోటా, అరటి, మొక్కజొన్న పంటల విషయంలో అదే జరుగుతోందన్నారు. రైతులు ఎప్పుడెప్పుడు, ఏ పంటలు సాగు చేయాలి, దిగుబడులు ఎక్కువగా రావాలంటే ఏం చేయాలి... వైరస్ లు వచ్చినప్పుడు ఎలాంటి మందులు పిచికారి చేయాలి వంటి అంశాల గురించి వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. మరోవైపు వైసీపీ నాయకులు రైతులను అడ్డం పెట్టుకొని కొత్తరకం డ్రామాలు మొదలు పెట్టారన్నారు. అధికారంలో ఉండగా ఏ ఒక్క రైతుకు కూడా న్యాయం చేయని వారు ఇప్పుడు రోడ్డెక్కి నిరసనలు చేస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మీరు అధికారంలో ఉండగా కనీసం ఒక రైతుకైనా డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందించారా అని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి, రైతుల కష్టాల గురించి ఏ రోజు పట్టించుకోని వారు ఇప్పుడు తగుదునమ్మా అంటూ బయలుదేరారని ఎమ్మెల్యే సునీత విమర్శలు చేశారు....

## తమలంపూడికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముగిసిన శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ :** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పేరా రామచంద్రపురం గ్రామంలో తమలంపూడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ జన్మదిన వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈకార్యక్రమం నాచేతులు మీదుగా జరుగడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తమలంపూడి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. శతదినోత్సవం ముగింపు సందర్భంగా వైభవంగా వచ్చిన భక్తులు అన్నదానకార్యక్రమంలో పాల్గోని బాబాను స్మరిచుకున్నారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలోమహిళా భక్తులు పాల్గొన్నారు.

# మౌనగిరి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పరిటాల కుటుంబం

- ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు, నిర్వాహకులు
- 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు
- ఆంజనేయస్వామి కృపాకటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే సునీత





**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 25:** రాప్తాడు నియోజకవర్గం లోనిరాప్తాడు మండలం హంపాపురం సమీపంలో... దక్షిణ భారత దేశంలోనే ఎత్తయిన (39అడుగులు) ఏకశిలా విగ్రహం రూపంలో కొలువై ఉన్న శ్రీ మౌనగిరి హనుమత్ క్షేత్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయంలో మంగళవారం రోజు 8వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ కు నిర్వాహకులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ తో కలసి స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అలాగే స్వామివారి ప్రసాదాన్ని ఎమ్మెల్యే సునీత ఇతర కుటుంబ సభ్యులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఏకశిలా ఆంజనేయ స్వామి విగ్రహం రాప్తాడు మండలంలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇక్కడ ప్రజలపై స్వామివారి కృపాకటాక్షాలు ఎప్పటికీ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం పై ఆమె నిర్వాహకులను అభినందించారు.

# వైయస్ఆర్‌సీపీ పార్టీ విజయమే మనందరి లక్ష్యం- మాజీఎమ్మెల్యే సత్తి

- పార్టీ వివిధ విభాగాలలో పదవులు పొందిన వారిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 25:** నిరంతరం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పని చేయాలని అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దిశానిర్దేశం చేశారు. కుతుకులూరు గ్రామం నుంచి నియమితులైన తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా సత్తి సోమిరెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యవర్గ సభ్యులుగా కర్రి వీరరాఘవరెడ్డి, జిల్లా సేవాదళ్ విభాగం కార్యదర్శిగా సబ్బెళ్ల రామారెడ్డి, మండల ఎస్సీ సెల్ కార్యదర్శిగా కొత్తపల్లి సత్యవతి లను డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని దూరం చేసుకుని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలో ప్రజల విశ్వాసం మళ్లీ జగన్ మోహన్ రెడ్డి వైపు మొగ్గుతుందని అన్నారు. పార్టీ పదవులు పొందిన అందరం కూడా ప్రణాళికాబద్ధంగా పని చేసి వచ్చే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ గెలిపించడమే మన అంతిమ లక్ష్యం కావాలని దీని కోసమే నిరంతరం శ్రమించాలని డాక్టర్ సత్తి సూర్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో సబ్బెళ్ళ కృష్ణారెడ్డి (అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి), సబ్బెళ్ళ నాగిరెడ్డి (కుతుకులూరు గ్రామ ఉపసర్పంచ్), పడాల దుర్గారెడ్డి (ఆర్కే) (నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు), చిర్ల వీర వెంకటరెడ్డి (రమణ)(కుతుకులూరు గ్రామ పార్టీ కన్వీనర్), తేతలి రుక్మిణి (మండల మహిళా విభాగం కార్యదర్శి), మండ సుజాత (మహిళా విభాగం నాయకురాలు), పార్టీ నాయకులు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, దొరబాబు, టేకి శ్రీను, తేతలి భూపారెడ్డి, పట్టాభి, పల్లంకి సత్తిబాబు, మండ సూరి రెడ్డి, కె.సుధాకర్ రెడ్డి, నేల వీర్రాజు, రామవరపు రాజు తదితర వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అరటి రైతులను ఆదుకోండి

- కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షోభంలో వ్యవసాయం
- ఏ పంటకూ గిట్టుబాటు ధర లేని దయనీయం
- విత్తనం నుంచి విక్రయం వరకు అన్నింట్లోనూ విఫలం
- ప్రభుత్వం తక్షణం పంటలు కొనుగోలు చేయాలి
- లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుటే నిరసన తెలియజేస్తాం
- కలెక్టర్ ఆనంద్‌తో వైఎస్ఆర్‌సీపీ నేతల అనంత వెంకటరామిరెడ్డి మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్






**అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 25:** జిల్లాలో అరటి రైతులను ఆదుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుటే రైతులు ఉత్పత్తి చేసిన పంటలను ఉంచి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, గువ్వల శ్రీకాంత్ రెడ్డి వెన్నపూస రవీంద్రారెడ్డి చంద్రపలువురు రైతులు కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రైతాంగం పడుతున్న కష్టాలను వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రెండు ఖరీఫ్ సీజన్లు, ఒక రబీ సీజన్ ముగిసిందని గుర్తు చేశారు. ఏ సీజన్‌లోనూ ప్రభుత్వం రైతులను ఆదుకున్న దాఖలా లేదన్నారు. ప్రస్తుతం అరటి రైతులు గిట్టుబాటు ధర లేక పంటను తోటలను వదిలేస్తున్నారని, పశువులకు మేతగా వేస్తున్నారని చెప్పారు. జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో అరటి సాగయితే 8 లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చేదని తెలిపారు. అరటి కోతలు ప్రారంభం అయినా ఎక్కడా గిట్టుబాటు ధర లేదని చెప్పారు. టన్ను రూ.1000 నుంచి రూ.2000 ఉంటే రైతులు బతికేదెలా అని ప్రశ్నించారు. డిసెంబర్‌లో మళ్లీ అరటి కోతలు ప్రారంభం అవుతాయని, తక్షణం ప్రభుత్వమే అరటి పంటను కోనుగోలు చేయాలని కోరారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం తప్పితే ఇక్కడి రైతులకు కలిగిన ప్రయోజనం శూన్యమన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రత్యేకంగా కిసాన్ రైళ్లను నడిపిన విషయాన్ని కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు, మూడు రోజుల్లో స్పందించకపోతే అరటి పంటను కలెక్టరేట్ వద్ద ఉంచి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, సజ్జ, పత్తి తదితర పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.2100 ఉంటే రూ.1500కు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా పప్పుశనగ విత్తనం పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేని దుస్థితి జిల్లాలో నెలకొందని కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాకు కేటాయించిన విత్తనంలో సగం కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందించడంలోనూ విఫలమైందన్నారు. సుమారు రూ.230 కోట్ల వరకు ఇన్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందాల్సి ఉందని తెలిపారు. తక్షణం రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రైతాంగం తరఫున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు, రైతులు పాల్గొన్నారు.

## "రైతన్న...మీ కోసం. ...." కార్యక్రమం లో భాగంగా రైతుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి శ్రీ నాదెండ్ల,ఎమ్మెల్యే నల్లమిల్లి

"రైతన్న...మీ కోసం. ...." కార్యక్రమం లో భాగంగా రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి,రైతుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి శ్రీ నాదెండ్ల,ఎమ్మెల్యే నల్లమిల్లి





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 25::** బలభద్రపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డి తో మానాన్నకి ప్రత్యేక అనుబంధం ఉంది. ఆ నేపథ్యంలో వారి కుటుంబం గురించి నాకు లోతైన అవగాహన ఉంది ఒక తపనతో పని చేసే నాయకుడు రామకృష్ణారెడ్డి. ధాన్యం కొనుగోలు విషయంలో కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదు గత ప్రభుత్వంలో చేతకాని పాలనతో రైతులను నానా ఇబ్బందులు పెట్టారు, ఏ రైస్ మిల్లుకు అమ్మాలో ఎంత రేటు పెట్టాలో వారే చెప్పేవారు చివరకు సంచుల కోసం కూడా ధర్నాలు చేసిన పరిస్థితిని నాడు మనం చూసాం నాడు ఈ ప్రాంతం పర్యటించినప్పుడు చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ , మేము, అందరం రైతుల బాధలు చూసాం అందుకే వారికి ఏ ఇబ్బంది ఉండకూడదు అని పారదర్శకంగా ధాన్యం కొనుగోలు వ్యవహారం ఉండాలని అనేక సంస్కరణలు ఇప్పుడు తీసుకొచ్చాం 1674 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి గత ప్రభుత్వం వెళ్లిపోతే వాటిని మేము చెల్లించాం గత సంవత్సరం 48 గంటల్లో ఉన్నాం కానీ 24 గంటల్లోనే చెల్లింపులు చేశాం. ఈ సంవత్సరం కేవలం నాలుగు గంటల లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చేస్తున్నాం అనపర్తి నియోజకవర్గం లో 93 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని చెప్పారు ప్రతి బస్తా మేము కొనుగోలు చేస్తామని మాట ఇస్తున్నాను. గత సంవత్సరం 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే ఈ సంవత్సరం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనడానికి సిద్ధంగా ఉన్నాం రైతులు పంటలను కాపాడుకోవడం కోసం టార్పాలిన్ కూడా త్వరలో ఉచితంగా అందజేయనున్నాం, ఇప్పటికే సంచులు కొరత లేకుండా చూడగలిగాము ఇన్ని ఆర్థిక ఇబ్బందుల్లో కూడా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనాలని కోరుచున్నాను.

## - మాజీ మంత్రి పల్లెరఘు నాధ రెడ్డి కి

# అభినందనలు తెలిపిన సిపిఐ నాయకులు!

**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 25:** ఆధ్యాత్మిక విశ్వాసం, సేవ, అధికార ప్రభుత్వ యంత్రాంగం కలయికతో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు .... ఇదో చారిత్రాత్మక ఘట్టంగా చరిత్రలో మిగిలిపోతుందని సిపిఐ నాయకులు కితాబిచ్చారు. సత్య సాయి జయంతి ఉత్సవాలు ముగిసిన అనంతరం సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిపిఐ రాష్ట్ర నాయకులు కాటమయ్య, జింకా చలపతి, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు లు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డిని తన స్వగృహంలో కలసి ప్రశంసించారు. స్థానిక శాసన సభ్యురాలుగా సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు గత మూడు నెలలుగా పూర్తిగా శతజయంతోత్సవాలపై దృష్టి పెట్టి సక్సెస్ చేయడంలో కీలక పాత్ర పోషించారని వారు అభినందించారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జయంతోత్సవాలను ముందుండి నడపడం సత్యసాయి పట్ల ఉన్న భక్తి విశ్వాసానికి



ఇదో నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తనయుడు నారా లోకేష్ ప్రభుత్వపరంగా ఇక్కడే తిష్ట వేసి అటు ట్రస్ట్ ఇటు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ ఎక్కడ లోటుపాట్లు రానీయకుండా చర్యలు తీసుకొని ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా విజయవంతంలో తీవ్రంగా కృషి చేశారని వారు పేర్కొన్నారు. సత్య సాయి బాబా ఆశీర్వాదం వల్లనే ఈ వేడుకలను వీరందరి చేత ముందుండి నడిపించారని వారి పేర్కొన్నారు. ఈ శత జయంతి ఉత్సవాలను కల్లారా చూసి తిలకించడానికి వచ్చిన దేశ విదేశీ భక్తులు సైతం ఇక్కడ ఏర్పాట్లను చూసి పరవశించిపోయారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులతో పాటు ప్రధానంగా పల్లె రఘునాథ్ రెడ్డి, పల్లె సింధూర రెడ్డి లు ప్రభుత్వం తరఫున ప్రత్యేక నిధులు తీసుకురావడం అటు సత్యసాయి ట్రస్ట్ కూడా ఉత్సవాలను భారీగా జరప తలపెట్టాలని భావించడం చూస్తుంటే సత్య సాయి బాబా వెనకుండి భక్తులందరికీ ఎటువంటి లోటుపాట్లు రానీయకుండా పూర్తిగా భక్తి పారావశ్యంతో భక్తులు కొలిచేలా చేశారోమోననిపిస్తోందని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ కూడా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేసి భక్తులు మనశ్శాంతిగా స్వామిని కొలిచేలా చేయడంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు.

## నూతన సినిమా షూటింగ్ లాంఛనంగా

# ప్రారంభించిన మంత్రులు సుభాష్, దుర్గేష్

### - మంచి చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుంది

### - కోనసీమ సినిమా షూటింగ్ లకు పెట్టింది పేరు






**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 25:** సందేశాత్మక చిత్రాలను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని, మంచి కథతో సమాజాన్ని జాగృతం చేయవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సినిమా టోఫిగ్రఫీ , పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో రామ్కి ప్రొడక్షన్ నెంబర్ వన్ సౌజన్యం లో తెరకెక్కుతున్న రాజి నూతన చలనచిత్ర షూటింగ్ కార్యక్రమంలో ఇరువురు మంత్రులు పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత మలికిపురం చంటి రాజుగారి విల్లాస్ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ చిత్రంలో హీరో, దర్శకుడిగా రామ్ కి నటిస్తుండగా, హీరోయిన్ గా జయశ్రీ బర్మన్ ( అస్సాం ) తొలిసారిగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటులు రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జబర్దస్త్ టీం నుంచి జూనియర్ ఆర్టిస్టులు నటిస్తున్నారు. అనంతరం మంత్రులు వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్ లు మాట్లాడుతూ సందేశాత్మక చిత్రాలను ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు. ఇంటిల్లపాది సంతోషంగా చూసే సినిమాలు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా కేవలం కథ కాదని ప్రేక్షకులను ఆలోచింపజేసే ప్రయత్నంగా ఉండాలన్నారు. ప్రతి సినిమా ఒక కొత్త ప్రయాణమని, ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవాలని ఆశిస్తున్నామన్నారు. అనంతరం మంత్రులు రామ్ కి ప్రొడక్షన్ నెంబర్ వన్ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, చలనచిత్ర నటీనటులు, కాండ్రేగుల రాము తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై, బాలికలపై హింసను నివారించినపుడే సమాజాభివృద్ధి

### -సి.డి.పి.ఓ ఉమా శంకరమ్మ




**రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 25:** మహిళలపై, బాలికలపై హింసను నివారించినపుడే సమాజాభివృద్ధి సాధ్యమనిసి.డి.పి.ఓ ఉమాశంకరమ్మ అన్నారు. ఐసీడీఎస్, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో నినాదంతో అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినంలో భాగంగా రాప్తాడు కేజీబీవీలో ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరత్న, స్పెషల్ ఆఫీసర్ ముత్యాలమ్మ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ హింస అంటే కుటుంబ హింసనా, సమాజ హింసనా అని వివరించారు. సమాజ హింస అయితే ఆత్మ రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ మెళకువలను నేర్చుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1098,181,100 హెల్ప్ లైన్ నంబర్లను ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసే అవకాశం ఉంటే విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు వాటి వల్ల భవిష్యత్తులో జరిగే నష్టాలు, పరిణామాలపై చైతన్యవంతం చేయాలన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలోని అన్ని కేజీబీవీ లలో కూడా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటేశ్వరి, చంద్రకళ, మిషన్ శక్తి వన్ స్టాప్ సెంటర్ పారామెడికల్ రాజ్యలక్ష్మి, కేస్ వర్కర్ మంజుల, కౌన్సిలర్ సంధ్య, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ సుహాసిని, కేజీబీవీ ఎస్ఓ ముత్యాలమ్మ, అంగన్వాడీ వర్కర్లు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు పక్షపతిగా సీఎం నారా చంద్రబాబు

### - రైతుల మేలుకోసమే రైతన్నా.. మీ కోసం


### - నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**అంకుశం న్యూస్ కర్నూల్ నవంబర్ 25:** మాది మంచి రైతు ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు పక్షపతిగా పాలన చేస్తున్నారు, రైతల మేలుకోసం రైతన్నా.. మీ కోసం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇంటి ఆవరణలో రైతన్నా.. మీకోసం అవగాహన సధస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ, మైకనేజేషన్ టెక్నాలజీ, ప్రకృతి వ్యసాయం, ఆధునిక టెక్నాలజీ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడి సాయం రైతులకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మా ఉమ్మడి ప్రభుత్వం అని, ఉమ్మడి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. 'రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని ఈ నెల నవంబర్ 24 నుండి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలనే లక్ష్యంతో ఉమ్మడి ప్రభుత్వం పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తోందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ (AgriTech), ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు, ఈ పంచ సూత్రాల ద్వారా వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి, అన్నదాతలకు అన్నివిధాలా అండగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ నాగేశ్వరావు, రైతులు చంద్రుడు, శివ, కరీం, సత్యం రెడ్డి, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026పై శిక్షణ కార్యక్రమం




**అంకుశం న్యూస్ అనంతపురం, నవంబర్ 25 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026కు సంబంధించి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్ఏఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు 27వ తేదీలోపు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్ఏఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించగా, ఈ విషయమై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్ఏఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

- ఈ సందర్భంగా డిఆర్ఓ ఏ.మలోల మాట్లాడుతూ 2002 ఓటర్ లిస్ట్ లో ఉన్న వారి జాబితా ప్రకారం 2025 ఓటర్ లిస్ట్ లో వారి వారసులతో మ్యాపింగ్ చేయమని, పెండింగ్ క్లయిమ్స్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్ఏఎస్ లు వారి నియోజకవర్గాలలో బిఎల్ఓలు, సూపర్ వైజర్ లు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్ఏఎస్ లు పాల్గొన్నారు.

## వారసత్వ పురాతన కట్టడాలను కాపాడుకుందాం

### - ప్రజలందరి భాగస్వామ్యంతో వారసత్వ కట్టడాల పరిరక్షణ చేయాలిలి

### - : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్







**అంకుశం న్యూస్ అనంతపురం, నవంబర్ 25 :** ప్రజలందరి భాగస్వామ్యంతో వారసత్వ కట్టడాల పరిరక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శన శాలలో పురావస్తు & ప్రదర్శన శాలల శాఖ, ఇంటాక్, డిస్కవర్ అనంతపురము, లేడీస్ క్లబ్ మరియు ఇన్నర్ వీల్ లు సంయుక్తంగా ఏడు రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2025 ఘనంగా ముగియగా, ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ వారోత్సవాలను ఈనెల 19వతేదీ నుంచి ఈరోజు వరకు నిర్వహించడం జరిగిందని, రాష్ట్ర పురావస్తు & ప్రదర్శన శాలల శాఖ, ఇంటాక్, డిస్కవర్ అనంతపురం, లేడీస్ క్లబ్ మరియు ఇన్నర్ వీల్ లు సంయుక్తంగా ఏడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇంటాక్ సంస్థ, డిస్కవర్, లేడీస్ క్లబ్ మరియు ఇన్నర్ వీల్ లాంటి సంస్థలు వారసత్వ కట్టడాల పరిరక్షణకు ముందుకు వచ్చి వాటిని కాపాడుకోవడమేకాక, వాటిని ప్రమోట్ చేసే బాధ్యతను తీసుకోవడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నెలకొకమారు ఏదో ఒక చోట చేస్తుండాలని, అలాంటప్పుడే పిల్లలకు మరియు ప్రజలకు మన సంస్కృతి, వారసత్వం గురించి అవగాహన వస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిల్పారామం, ఆర్కియాలజీ మ్యూజియం, తదితర వాటికి పిల్లలను తీసుకువెళ్లాలన్నారు. అవుట్ డోర్ కార్యక్రమాల్లో పాల్గొనాలని, ప్రపంచ వారసత్వ వారోత్సవాలను విజయవంతం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శన శాలల శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్ మాట్లాడుతూ వారోత్సవాలు విజయవంతముగా ముగియడం జరిగిందని, మొదటి రోజున హెరిటేజ్ వాక్ మొదలుకొని, నాణేములు మరియు స్టాంప్స్ ప్రదర్శన, పద్య పఠనం, మానవ మనుగడలో చెట్ల పాత్ర సంప్రదాయ వంటలు ల వంటి కార్యక్రమాల గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ రామకుమార్, డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మ నారాయణ రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ జయంతి, ఇంటాక్ కో కన్వీనర్ పిడతల కృష్ణమూర్తి, జిల్లా పర్యటకాధికారి జయకుమార్ బాబు, ఇంటాక్ సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ రియాజుద్దీన్ అహమ్మద్, డాంఎం సిగిలిరేవు రామాంజినేయులు, టి.వి.రెడ్డి, యాడికి సూర్యనారాయణ రెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, అశోకవర్ధన్ రెడ్డి మరియు పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నవంబర్ 26 న గంటలకు భారత రాజ్యాంగ ప్రస్థావన సామూహిక పఠనం

### - జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్

**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి, నవంబర్ 25:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26, 2025 (బుధవారం) ఉదయం 11.30 గంటలకు అన్ని కార్యాలయాలలో రాజ్యాంగ ప్రస్థావన ను సామూహికంగా చదవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. సంవిధాన దినోత్సవాన్ని ప్రతి ప్రభుత్వ శాఖ, కార్యాలయం, సంస్థలో తగిన గౌరవంతో నిర్వహించాలని, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యమైందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సామూహిక పఠనాన్ని నిర్వహించాలనే ఆదేశాలను జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పోలీస్ శాఖ, అన్ని జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితర శాఖలు తమ తమ పరిధిలోని అధికారులతో కలిసి ఈ సామూహిక పఠన కార్యక్రమాన్ని నిర్వహించాల్సిందిగా సూచించారు. అందరు అధికారులు తమ పరిధిలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి, దాని గురించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## టిడిపి నేత అంతిమ యాత్రకు హాజరైన రాజకీయ ప్రముఖులు

### - పార్టీ లకు అతీతంగా అంతిమ యాత్రకు భారీగా హాజరైన అభిమానులు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 25:** గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందిన మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ అంత్యక్రియలు ఏడిద సంగమేశ్వరం లో ఘనంగా జరిగాయి. దాసిరెడ్డి వారి వీధి లోని ప్రకాష్ నివాసం గృహం నుండి భారీగా హాజరైన అభిమానులు జనసందోహం నడుమ అంతిమ యాత్ర ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, రాష్ట్ర నీటి పారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, వైసీపీ నేత రెడ్డి రాధాకృష్ణ తదితరులు కుటుంబ సభ్యులతో కైలాస రథం తో పాటు రుద్రభూమి కి హాజరయ్యారు. పెద్ద ఎత్తున హాజరైన అభిమానులు తమ అభిమాన నేత కు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రకాష్ అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రకాష్ కుమారుడు రాజీవ్ కిరీటి తండ్రి భౌతిక కాయానికి తలకొరివి పెట్టారు.

## మాలధారణ భక్తులకు ఉచిత భోజన సౌకర్యం!

### శ్రీ షిరిడీ సాయి బాబా ఆలయం లో అన్నదానం




**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 25:** ధర్మవరం శ్రీ షిరిడీ సాయి బాబా ఆలయం లో మాల దారణ భక్తులకు మండల దీక్ష చేయవారికి ఉచిత భోజనం సౌకర్యం బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం గొప్ప విషయం అని రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన శ్రీ షిరిడీ సాయి ఆలయం అన్నదానం కార్యక్రమం లో పాల్గొని పై విషయం పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాత డోలా రాజారెడ్డి దంపతులకు గిర్రాజు నాగేష్ అభినందనలు తెలియజేసారు.